రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు బ్రేక్

- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- వానకాలం మొదలైనా పూర్తికాని మరమ్మతులు

హైదరాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని స్టేట్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. వేసవిలోనే మరమ్మతులు పూర్తికావాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. వాహనదారుల నుంచి విమర్శలు రావడంతో అక్కడక్కడ తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. వర్షాకాలం మొదలు కావడంతో ఇప్పుడు పనులు ముందుకుసాగే వీలు లేదని అధికారులు చెబుతున్నారు.

గత ఏడాది భారీ వర్షాల కారణంగా రోడ్లు విపరీతంగా పాడవడంతో కేసీఆర్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు రూ.2500కోట్లు కేటాయించింది. అయితే అధికారుల ఉదాసీనత వల్ల పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో పనులు ముందుకు సాగలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపును నిలిపివేశారు. అంతేకాదు గతంలో మంజూరు చేసిన అనేక పనులను రద్దు చేశారు. దీంతో రోడ్ల మరమ్మతు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత వర్షాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,641కిలోమీటర్లమేర రోడ్లు పాడైపోయినట్టు గుర్తించగా అందులో సగం పనులు కూడా పూర్తికాలేదు. మరమ్మతులకు మొత్తం 1170పనులు మంజూరు చేయగా, అందులో 600పైచిలుకు పనులు నిలిచిపోయాయి. అలాగే, పూర్తయిన పనులకు సంబంధించి రూ. 800కోట్ల వరకూ బిల్లులు చెల్లించాల్సి ఉంది. వాటిని కూడా చెల్లించకపోవడంతో అత్యవసర మరమ్మతులు కూడా మిగిలిపోయాయి.

ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో అవకతవకలు

మొదటిపేజీ తరువాయి...

తేడా ఉంటున్నదని, దానిని సరిచేయాలని ఈసీని కోరింది. ఈమేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గురువారం రాత్రి బీఆర్‌కేఆర్ భవన్‌కు వెళ్లి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మొదటి ప్రాధాన్యం ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థికి ప్రయోజనం కలిగే విధంగా కౌంటింగ్ అధికారులు లెక్కలు వేస్తున్నారని ఆరోపించారు. ఓట్ల లెక్కింపులో జరుగుతున్న అవకతవకలపై ఆర్‌వో దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ప్రయత్నించినప్పటికీ, నాలుగు గంటలపాటు కనీస స్పందన లేదని మండిపడ్డారు. మొదటి ప్రాధాన్యం ఓట్ల లెక్కింపులో 3వ రౌండ్ 4వ హాల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 533 ఓట్ల మెజార్టీ వస్తే, ఆ ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థికి జమ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 3వ రౌండ్ 3వ హాల్‌లో తుది ఓట్ల లెక్కలు సరిపోలడంలేదని పేర్కొన్నారు. 4వ రౌండ్‌లోనూ వాస్తవ లెక్కలకు, నమోదు చేస్తున్న లెక్కలకు సరిపోలడంలేదని, వీటిపై వెంటనే రిటర్నింగ్ అధికారికి ఆదేశాలు జారీచేయాలని సీఈవోను కోరారు. బీఆర్ఎస్ ఏజెంట్ల సంతకాలు లేకుండా, అభ్యర్థికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అభ్యర్థి, ఏజెంట్ల అభ్యంతరాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా లెక్కింపు చేస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

కౌంటింగ్‌పై అనుమానాలు

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు తీరు గందరగోళానికి దారితీసింది. కౌంటింగ్ అధికారులు పారదర్శకత పాటించడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అభ్యర్థులు, ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి, ఆ పార్టీ ఏజెంట్లకు మాత్రమే ప్రాధాన్యమిస్తూ.. తమ అభ్యంతరాలను, అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని, తమ పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు అభ్యర్థులు, ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. ధర్మసమాజ్ పార్టీకి (డీఎస్పీ)కి చెందిన ఏజెంట్లు అధికారుల తీరును నిరసిస్తూ బుధవారం సాయంత్రం వాదనకు దిగారు. కౌంటింగ్ హాల్స్‌లో కాంగ్రెస్ పార్టీ మినహా మిగతా అభ్యర్థుల్లో ఎక్కువమంది తొలిరోజు అధికారుల తీరు సరిగా లేదని ఆరోపించారు. గురువారం సాయంత్రం బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ ఏజెంట్లతో కలిసి మీడియా ముందుకొచ్చారు. రాకేశ్‌రెడ్డి తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆర్‌వోకు ఒక లేఖ అందజేసినట్టు తెలిసింది. ఇది జరుగుతున్న సమయంలో రిటర్నింగ్ అధికారి హరిచందన కౌంటింగ్ కేంద్రంలో అందుబాటులో లేరు. మరో మీటింగ్ ఉండటంతో బయటకు వెళ్లారని అక్కడ ఉన్న అధికారులు తెలిపారు.



వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఓట్ల లెక్కింపులో అవకతవకలపై సీఈవోకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, లీగల్‌సెల్ సభ్యురాలు లలితారెడ్డి

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక తొలి ప్రాధాన్యం ఓట్లలో ప్రధాన అభ్యర్థులకు లభించిన ఓట్లు

అభ్యర్థి	ఓట్లు
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	1,22,813
రాకేశ్‌రెడ్డి (బీఆర్ఎస్)	1,04,248
ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	43,313
పాలకూరి అశోక్‌కుమార్ (ఇండిపెండెంట్)	29,697
బక్క జడ్సన్	2,057
బరిగెల దుర్గాప్రసాద్	1,947
పోలైన ఓట్లు	3,36,013
చెల్లిన ఓట్లు	3,10,189
గెలుపు కోటా	1,55,095

ఏకపక్షంగా ఫలితాల ప్రకటన : రాకేశ్‌రెడ్డి

అభ్యర్థుల అభిప్రాయాలు, అభ్యంతరాలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండానే రిటర్నింగ్ అధికారి ఏకపక్షంగా మూడో రౌండ్ ఫలితాలు ప్రకటించారని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. మూడో రౌండ్ మూడో హాల్‌లో తమ లెక్కల ప్రకారం వెయ్యి ఓట్లను బీఆర్ఎస్‌కు జమ చేయాల్సి ఉన్నదని చెప్పారు. దీనిపై ఆర్వోను కలిసి తమ వాదన వినిపించేందుకు మూడు గంటలపాటు వేచి చూసినప్పటికీ తమకు సమయం ఇవ్వకుండా పోలీసులతో నెట్టివేయించారని ఆరోపించారు. టేబుళ్ల మీద కౌంటింగ్ పూర్తయ్యాక ఏజెంట్లతో సంతకాలు లేకుండానే ఫలితం ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. తమ గెలుపును అడ్డుకునేందుకు ఓట్ల లెక్కింపులో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మూడు రౌండ్లు ముగిసే సరికి కాంగ్రెస్ అభ్యర్థికి 17 వేల ఓట్ల మెజార్టీ మాత్రమే ఉండగా, దానిని 18 వేలకు పెంచి ఏకపక్షంగా ప్రకటించారని ఆరోపించారు. ఓట్ల లెక్కింపులో ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద కూడా కాంగ్రెస్ ఖాతాలో ఓట్లు జమయ్యేలా ఒత్తిళ్లు కనిపిస్తున్నాయని ఆరోపించారు. చిన్న చిన్న విషయాల పట్ల తాము సర్దుకుపోతున్నా, చివరకు ఫలితాల ప్రకటనలోనూ ఏకపక్ష ధోరణి అవలంభిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని కౌంటింగ్ పారదర్శకంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నది. తొలి ప్రాధాన్యం ఓట్లలో ఫలితం తేలలేదు. తొలి ప్రాధాన్యం ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత కనబరిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపు కోటాగా 1,55,095 ఓట్లను నిర్ధారించగా, తొలి ప్రాధాన్యంలో ఆ మార్క్‌ను ఎవరూ సాధించలేదు. దీంతో ద్వితీయ ప్రాధాన్యం ఓట్ల లెక్కింపు కీలకంగా మారింది. తీన్మార్ మల్లన్న గెలుపొందాలంటే ఎలిమినేషన్ రౌండ్‌లో 32,282 ఓట్లు, రాకేశ్‌రెడ్డి గెలువాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంటుంది. దీంతో చివరి అభ్యర్థి వరకు ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగవచ్చు. ఇదంతా పూర్తయి విజేత ఎవవో తేలాలంటే శుక్రవారం మధ్యాహ్నం వరకు సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పారదర్శకంగా కౌంటింగ్

రిటర్నింగ్ ఆఫీసర్ హరిచందన

నల్లగొండ రూరల్, జూన్ 6: వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నదని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. ఏజెంట్లు సంతకాలు చేసిన తరువాతే ఫలితాలు ప్రకటిస్తున్నామని చెప్పారు. నల్లగొండ జిల్లా అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో గురువారం రాత్రి ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. రాత్రి 9 గంటల వరకు మొదటి ప్రాధాన్యం ఓట్ల లెక్కింపు పూర్తయిందని చెప్పారు. మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా.. అందులో 3,10,189 ఓట్లు చెల్లుబాటయ్యాయని, గెలుపు కోటా 1,55,095 ఓట్లు అని తెలిపారు. మొదటి ప్రాధాన్యం ఓట్ల లెక్కింపులో తీన్మార్ మల్లన్నకు 1,22,813, రాకేశ్‌రెడ్డికి 1,04,248, ప్రేమేందర్‌రెడ్డికి 43,313, పాలకూరి అశోక్ కూమార్‌గౌడ్‌కు 29,697 ఓట్లు వచ్చాయని వివరించారు. గెలుపునకు అవసరమైన 1,55,095 ఓట్లు మొదటి ప్రాధాన్యంలో ఎవరికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యం ఓట్లు లెక్కించనున్నట్టు తెలిపారు. 52 మంది అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ ప్రారంభిస్తామని తెలిపారు. చెల్లని ఓట్లు అధికంగా ఉండటం వల్ల కౌంటింగ్ ప్రక్రియ అలస్యమవుతున్నదని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ సీసీ టీవీల్లో రికార్డు అవుతున్నదని స్పష్టంచేశారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్లపై కేసు నమోదు

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సందర్భంగా నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో కౌంటింగ్ హాల్–2లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్వో వెంకటేశ్వర్లు వద్దకు వచ్చి బ్యాలెట్ పేపర్లు చూపించాలని భూపాల్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో భూపాల్‌రెడ్డి తన విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని ఏఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో కంచర్ల భూపాల్‌రెడ్డిపై తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరిసిల్ల అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ జయకేతనం

12 స్థానాల్లో 8 మంది పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపు

ఫలించిన కేటీఆర్ వ్యూహం.. విజయోత్సాహంలో శ్రేణులు

బీజేపీ ప్రస్టేషన్.. బీఆర్ఎస్ డైరెక్టర్ కిడ్నాప్‌నకు యత్నం

పోలీసుల లాఠీచార్జి.. నాయకులకు గాయాలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 6 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల్లో బీఆర్ఎస్ జయకేతనం ఎగురవేసింది. గురువారం 12 డైరెక్టర్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 8 స్థానాల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందగా, ఇద్దరు ఇండిపెండెంట్లు, బీజేపీ, కాంగ్రెస్ తరపున ఒక్కో అభ్యర్థి గెలుపొందారు. గెలిచిన ఇద్దరు ఇండిపెండెంట్లలో ఒకరు గుడ్ల సత్యానందం బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ మద్దతుదారుల సంఖ్య 9కి చేరింది. నేడు చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. గెలిచిన వారిలో రాపెల్లి లక్ష్మీనారాయణ (బీఆర్ఎస్), గుడ్ల సత్యానందం (ఇండిపెండెంట్), చొప్పదండి ప్రమోద్ (కాంగ్రెస్), అడ్డగట్ల మురళి (బీఆర్ఎస్), పాటికుమార్ రాజు (బీఆర్ఎస్), బుర్ర రాజు (బీఆర్ఎస్), వేముల సుక్కమ్మ (బీఆర్ఎస్), అడ్డగట్ల దేవదాస్ (బీఆర్ఎస్), ఎనగందుల శంకర్ (బీఆర్ఎస్), వలస హరిణి (ఇండిపెండెంట్), పత్తిపాక సురేశ్ (బీజేపీ), కోడం సంజీవ్ (బీఆర్ఎస్) ఉన్నారు. మొత్తం 12 స్థానాలకు 61 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 4,755 మంది ఓటు హక్కు (77 శాతం)ను వినియోగించుకున్నారు.

ఫలించిన కేటీఆర్ వ్యూహం

అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యూహం ఫలించింది. ఎన్నికల ముందు రెండు రోజులుగా ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేటీఆర్ చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. దీంతో వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ డైరెక్టర్ కిడ్నాప్‌నకు బీజేపీ యత్నం

సిరిసిల్ల అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఓటమి చెందిన అసహనంతో బీజేపీ నేతలు బీఆర్ఎస్ డైరెక్టర్‌ను కిడ్నాప్ చేసేందుకు యత్నించటం కలకలం రేపింది. గురువారం సాయంత్రం సిరిసిల్ల ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుని అభ్యర్థులు బయటకు వచ్చారు. అప్పటికే సిద్ధంగా ఉన్న పార్టీ నాయకులు వారిని కార్లలో ఎక్కించారు. అయితే బీఆర్ఎస్ నుంచి గెలిచిన, సిరిసిల్ల పట్టణంలోని 12 డివిజన్‌కు చెందిన కోడం సంజీవ్‌ను కిడ్నాప్ చేసేందుకు బీజేపీ నేతలు యత్నించారు. కారులో నుంచి బయటికి లాగి తమ కారులో ఎక్కించుకున్నారు. వెంటనే తేరుకున్న బీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌ను తీసుకొని వచ్చి వారి కార్లలో ఎక్కించుకుని అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఈ ఘటనలో బీఆర్ఎస్ నాయకులు సికిందర్, కల్లూరి మధు తీవ్రంగా గాయపడ్డారు.

ముగిసిన ఎన్నికల కోడ్

గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో కొనసాగనున్న కోడ్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 80 రోజుల సుదీర్ఘ ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఉపఎన్నిక కౌంటింగ్ కొనసాగుతున్నందున ఈ జిల్లాల పరిధిలో కోడ్ కొనసాగనుంది. మార్చి 16న కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ రోజు నుంచి దేశవ్యాప్తంగా ఎన్నికల అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలో మే 13న నాలుగో విడతలో ఎన్నికలు ముగిసినా ఓట్ల లెక్కింపు, ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే వరకు కోడ్ అమల్లో ఉంది.

డ్రగ్స్, సారాపై ఉక్కుపాదం

కట్టడికి ముడి పదార్థాలపై ఎక్సైజ్‌శాఖ నిఘా

నెలలోనే 3,380 కేసులు, భారీగా సారా ధ్వంసం

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్, సారాపై ఎక్సైజ్‌శాఖ ఉక్కుపాదం మోపుతున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో ఎక్కడికక్కడే సోదాలు నిర్వహిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రూ.1.73 కోట్ల విలువైన గంజాయి, బెల్లం పట్టుకొని ఎక్సైజ్‌శాఖ రికార్డులు సృష్టించింది. ఇటీవలి ఎక్సైజ్‌శాఖ సోదాల్లో 30 గ్రాముల ఎండీఎంఏ, 80 గ్రాముల హెరాయిన్, ఓపీఎం చిక్కింది. హైదరాబాద్‌లో రూ.1.70 కోట్ల విలువ చేసే డ్రగ్స్, రూ.2 కోట్ల స్పిరిట్‌ను సీజ్ చేశారు. భద్రాచలంలో 492 కేజీల, మణుగూరులో కోటి విలువైన 477 కేజీల గంజాయిని ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 31 నాటికి రాష్ట్రంలో సారా మూలాలను పూర్తిగా ధ్వంసం చేయాలనే లక్ష్యంతో ఎక్సైజ్ పోలీసులు సోదాలు చేపడుతున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్, నల్లగొండ, కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, భూపాలపల్లి, భద్రాచలం, నిజామాబాద్, కొడంగల్, పరిగి ప్రాంతాల్లోని 26 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సారా తయారీ, వినియోగం ఎక్కువగా ఉంటుందని ఆబ్కారీశాఖ గుర్తించింది. ఆయా జిల్లాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టిన అధికారులు.. మేలో 3,380 కేసులు నమోదు చేశారు. 16,951 లీటర్ల సారాను, 14,83,600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 19,477 క్వింటాళ్ల బెల్లం, 1617 కేజీల అల్లం స్వాధీనం చేసుకున్నారు. 1,159 మందిని అరెస్టు చేసి, రూ.4.45 లక్షల జరిమానాలను వసూలు చేశారు. సారా నిర్మూలనే లక్ష్యంగా ముడి పదార్థాలపై నిఘా పెంచారు. మే నెలలో 100 కేసులు నమోదు చేసి, 1,396 లీటర్ల నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్‌ను సీజ్ చేసి, 34 మందిని అరెస్టు చేశారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

- సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): బ్లాక్ మార్కెటింగ్, విత్తనాల నిల్వలను అరికట్టడంలో సమర్థవంతమైన చర్యలు తీసుకున్నందుకు జిల్లాల కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి అభినందించారు. రాబోయే మూడు వారాల పాటు ఇదేవిధంగా నిఘా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్యాక్ చేసిన విత్తనాలను కొనుగోలు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సీజన్ ముగిసే వరకు విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను భద్ర పరుచుకునేలా చూడాలని తద్వారా అవసరమైతే నష్ట పరిహారం క్లెయిమ్ చేసుకోవడానికి వీలవుతుందని సీఎస్ సూచించారు. కేంద్ర గోడౌన్ల నుంచి మండల స్థాయి వరకు ఎరువుల తరలింపును పర్యవేక్షించి రైతులకు సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే విషయాన్ని నిర్ణీత గడువులోగా సర్వే చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభించే నాటికి ఒక జత స్కూల్ యూనిఫాం విద్యార్థులకు అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీజీపీ రవిగుప్తా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏదీ?

మొదటిపేజీ తరువాయి...

జూన్ 26న రైతుబంధు పెట్టుబడి సాయం పంపిణీని ప్రారంభించి, దాదాపు నెలన్నర లోనే మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఆ సీజన్‌లో 68.99 లక్షల మంది రైతులకు రూ.7,624 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందజేసింది. అయితే, ముగిసిన యాసంగి సీజన్‌లో రైతుబంధు కింద నిధులు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వానకాలం సీజన్‌ను నుంచి రైతుభరోసాను అమలుచేస్తామని తెలిపింది. రైతు భరోసాకు నిబంధనలు మారుస్తామని, సాగు చేసిన భూములకే ఇస్తామని, అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తూ వస్తున్నారు. ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి కార్యచరణ ప్రారంభం కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. అసెంబ్లీ సమావేశాలు జరిగేదెప్పుడు? రైతుభరోసాపై చర్చించేదెప్పుడు? నిబంధనలు ఖరారు చేసేదెప్పుడు? పెట్టుబడి సాయం అందించేదెప్పుడు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మహబూబ్‌నగర్‌లోని మినీ ట్యాంక్‌బండ్ రోడ్డుపై వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
మెదక్	40.3°c	23.5°c
రంగారెడ్డి	40.2°c	21.8°c
నిజామాబాద్	40.1°c	26.8°c
నల్లగొండ	40.0°c	26.6°c
మహబూబ్‌నగర్	38.2°c	28.4°c
ఆదిలాబాద్	37.7°c	28.1°c
కరీంనగర్	36.0°c	28.0°c
ఖమ్మం	35.0°c	26.0°c
వరంగల్	35.0°c	27.0°c
హైదరాబాద్	34.9°c	24.5°c

ప్రాణాలు తీసిన పిడుగుల వాన

రాష్ట్రవ్యాప్తంగా 9 మంది మృత్యువాత • కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 6 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి భారీగా ప్రాణ నష్టం జరిగింది. పలు జిల్లాల్లో బీభత్సం సృష్టించిన పిడుగుల వానకు ఒకేరోజు తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. పెద్ద ఎత్తున వరదనీరు చేరి పట్టణాలు, కాలనీలు, రహదారులు జలమయమయ్యాయి. వివిధ మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. పలు చోట్ల చెట్లు కూలిపడి విద్యుత్తు తీగలపై పడటం వల్ల కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరికొన్ని చోట్ల కూలిన చెట్లు రోడ్లపై అడ్డంగా పడటంతో ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలిగింది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన యువరైతు ముడపల్లి ప్రవీణ్ (26), తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామానికి చెందిన మాగీర్వాడ్ శ్రీ (10) పిడుగు పడి మృతి చెందారు. ప్రవీణ్‌కు భార్య అశ్విని, కూతురు శ్రీనిక (ఏడాది) ఉన్నారు. మెదక్ జిల్లా హవేళీఘన్‌పూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన శెట్టబోయిన సిద్ధయ్య (50), ఓడంగల నందు (22) దుర్గమ్మ గుట్టకు వెళ్లగా పిడుగు పడి అక్కడిక్కడే మృతిచెందారు. కౌడిపల్లి మండలం పీర్లతండాకు చెందిన గెమ్యానాయక్ (53) సలాబత్‌పూర్ గ్రామ శివారులో గొర్రెలు మేపుతుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో అమరగొండ ఎల్లయ్య అనే గొర్రెల కాపరి పిడుగుపాటుతో గాయాలపాలయ్యాడు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ శివారులో పొలంలో విత్తనాలు నాటుతున్న భార్యాభర్తలు పిడుగుపాటుకు గురయ్యారు. బేగరి జంగమ్మ (40) మృతి చెందగా.. భర్త కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వారిని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం దండిగుట్ట తండాకు చెందిన బానోవత్ పీర్యానాయక్ (85) సమీప గ్రామమైన కళ్యాపూర్ శివారులో గేదెలు మేపుతుండగా పిడుగుపడి ఛాతి కింది భాగంలో మంటలు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం డోంగర్‌గాం గ్రామానికి చెందిన అనక సంతోష్ (27), ఆయన భార్య స్వప్న (24)పై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి ఏడాది పాప భాను ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. ఇంటి పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని మల్కాపూర్ గ్రామంలో తాడిచెట్టుపై పిడుగు పడింది.

ముడపల్లి ప్రవీణ్, మాగీర్వాడ్ శ్రీ (ఫైల్)

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మార్కెట్ యార్డులో వరద నీటికి కొట్టుకుపోయిన ధాన్యం

ఆరబెట్టిన ధాన్యం వర్షార్పణం

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఖానాపూర్ మండలంలో పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ఒకవైపు తూకం వేసిన ధాన్యం తరలించకుండానే తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 15 రోజులుగా తూకం వేసేవాళ్లు కరువయ్యారు. వ్యవసాయ పొలంలో రెండు ఆవులు మేత మేస్తుండగా పిడుగు పడి మృత్యువాత పడ్డాయని, ప్రభుత్వం పరిహారం అందించి